క్లుప్తంగా

పీహెచ్‌సీలో తనిఖీ



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా మాతాశిశు సంరక్షణ పౌష్టికాహార ప్రత్యేక అధికారి ఆచార్య గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిధిలో గర్భిణుల, ప్రసవించిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుట్టిన శిశువుల ఆరోగ్యంపై ఆరాతీశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కిరణ్ రాజ్, సాంబయ్య, రహమాన్, సబిత, తదితరులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌కు అభినందన



సంగెం : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువా కప్పి అభినందన తెలిపారు. కార్యక్రమంలో పల్లారుగూడ, వీఆర్‌ఎస్ తండాల గ్రామ కమిటీల అధ్యక్షులు గుగులోత్ స్వామి, నర్సింహ నాయక్, సీనియర్ నాయకులు గుర్రం రాజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బుధరావుపేటకు చెందిన వీరన్న నర్సంపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా నర్సంపేట నుంచి గూడూరు దిశగా మద్యం లోడుతో వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరన్నతోపాటు అతని వెంట ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మంగళవారిపేటకు చెందిన పుష్పలతకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎస్సై రఘుపతి సందర్శించి విచారణ చేపట్టారు.

మద్యం విక్రేతపై కేసు



పర్వతగిరి : మండలంలోని దూపతండాలో ప్రభుత్వ అనుమతి లేని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.వెంకన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దూపతండాలో బానోతు దయాకర్ ప్రభుత్వ అనుమతి లేకుండా తన కిరాణం షాపులో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. దయాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నివాళి



ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన బీరం పుల్లయ్య, కోమటిపల్లి తండాకు చెందిన చందు గుండెపోటుతో మృతి చెందగా వారి మృతదేహాలకు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భూక్యా పద్మావతి తదితరులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ బోడ పూల్‌నాయక్, భూక్య వెంకన్ననాయక్, రాజు, శక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అరూరి' జన్మదిన వేడుక



పర్వతగిరి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ జన్మదిన వేడుకను గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ అధ్యక్షతన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినోద్‌కుమార్, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రంగు కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్, చీమల భిక్షపతి, నాయకులు చీమల చంద్రయ్య, యాకయ్య, నర్సయ్య, ప్రభాకర్, వెంకటేశ్, మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులతో జీవితంలో ఉన్నతి

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు

నర్సంపేట : ప్రాజెక్టులతో విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. తెలంగాణ కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'జిజ్ఞాస–స్టూడెంట్స్ స్టడీ' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల నుంచి భౌతిక, గణిత శాస్త్రాల నుంచి రెండు ప్రాజెక్టులు సమర్పించిన క్రమంలో విద్యార్థులను కళాశాల ఆవరణలో గురువారం ఆయన అభినందించి మాట్లాడారు. ప్రాజెక్టుల వల్ల విద్యార్థులు నేర్చుకున్న వివిధ పాఠ్యాంశాలు నిజజీవితంలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుసుకోవచ్చని చెప్పారు. భౌతిక శాస్త్రంలో పి.త్యాగయ్య పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ చంద్రయాన్ 3–సక్సెస్ అండ్ ఇంపాక్ట్ ఆన్ ఫ్యూచర్ స్పేస్ మిషన్ ఆఫ్ ఇండియా' ప్రాజెక్టును ఎ.రచన, జె.మౌనిక, బి.అంకిత, కె.అనూష, బి.రజనీకాంత్, ఈ.కార్తీక్ సమర్పించినట్టు తెలిపారు. విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కలిగించేలా అటానమస్ కరికులంలో ఏటా అన్ని సబ్జెక్టుల్లో ప్రాజెక్టు ప్రజెంటేషన్‌ను తప్పనిసరి ఆక్టివిటీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల ఐక్యూఏ సమన్వయకర్త డాక్టర్ ఏ.శ్రీనాథ్, కళాశాల జిజ్ఞాస సమన్వయకర్త డాక్టర్ లకన్‌సింగ్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రాజెక్టు ప్రజెంటేషన్ కోసం డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ వి.పూర్ణచందర్ తోడ్పాటు అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.త్యాగయ్య, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ ఐ.శివనాగశ్రీను, ఎం.సమ్మయ్య, డాక్టర్ టి.సుమతి, డాక్టర్ బి.రమేశ్, ఎం.శైలజ, డాక్టర్ వి.పూర్ణచందర్, డాక్టర్ ఆర్.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

సంగెం : బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని కుంటపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన పార్టీ మండల బూత్ కమిటీల అధ్యక్షుల, ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజేశ్వర్‌రావు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ గెలవాలని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌లో పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజలు అసహనంతో ఉన్నారని తెలిపారు. వరంగల్ ఎంపీగా ఆరూరి రమేశ్‌ను గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, నాయకులు శ్రీనివాస్, యాదగిరిరావు, శేషాద్రి, దేవేందర్‌రెడ్డి, కృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జీపీ పన్నుల వసూళ్లలో వెనుకబాటు

సంగెం : గ్రామ పంచాయతీ పన్నుల వసూలులో మండలం వెనుకబడింది. సరాసరి 71 శాతమే వసూలైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యం 46,24,683 కాగా గడువు ముగిసే సరికి రూ.32,73,582 వసూలయ్యాయి. గాంధీనగర్‌లో 109, కొత్తగూడెంలో 104 శాతం పన్నులు వసూలు కాగా గవిచర్లలో 61, షాపూర్‌లో 65 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. పన్నుల వసూలులో చిన్న గ్రామాలు ఆదర్శంగా నిలువగా పెద్ద గ్రామాలు వెనకబడ్డట్టు తెలుస్తోంది. గవిచర్లలో రూ.1,74,002, రామచంద్రపురంలో రూ.95,593, మొండ్రాయిలో రూ 61,691 వసూలు కావాల్సి ఉంది. మొత్తం 11 గ్రామాల్లో నూరు, 12 గ్రామాల్లో 90 శాతానికిపైగా పన్నులు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగియడంతో బకాయిలు 2024–25 ఆర్థిక సంవత్సర డిమాండ్ తోపాటుగా ఎరియర్లుగా కలవనున్నవి.

టెన్త్ మిత్రులు, పూర్వవిద్యార్థుల ఔదార్యం

● బాధిత కుటుంబానికి రూ.1.22 లక్షల సాయం



బాండ్, నగదు అందిస్తున్న మహేందర్, తదితరులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలోని శ్రీగురుకుల విద్యాలయ పూర్వవిద్యార్థి దొంతి రవికుమార్‌రెడ్డి (చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామవాసి) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు, స్కూల్ పూర్వ విద్యార్థులు కలిసి రూ.1,22,847 సాయం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ కూతురు అద్విక పేరిట ఎల్ఐసీలో డిపాజిట్ చేసిన రూ.97,347 బాండ్‌ను, రవికుమార్ తల్లికి రూ.25,500 నగదును రవికుమార్ స్నేహితులు మండల మహేందర్, అల్లి రవికుమార్, డ్యాక కిరణ్ గురువారం అందజేశారు. తొలుత రవికుమార్ కుటుంబాన్ని వారు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు 2008 టెన్త్ బ్యాచ్‌తోపాటు పూర్వ విద్యార్థులు (కొందరు ఎన్ఆర్ఐలు) కలిసి రూ.1,22,847 సమీకరించినట్టు చెప్పారు. పిల్లలిద్దరూ ఐదేళ్లలోపు చిన్నారులే కావడం, పేదరికం నేపథ్యంలో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రవికుమార్ సతీమణి భవానీ కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామ పంచయాతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి శంషొద్దీన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి నేపథ్యంలో బాటసారుల, ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్ కల్వచర్ల సాంబయ్య, నాంపెల్లి కుమార్, నాంపెల్లి ఐలుమల్లు, మేకల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



ఉపాధ్యాయులతో ప్రీ స్కూల్ విద్యార్థులు

నెక్కొండ : ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులు పట్టభద్రుల అవతారంలో ఆహూతులను, ఉపాధ్యాయులను అలరించారు. బంగారు భవిష్యత్తు తమ సొంతమన్న భరోసాతో ఉత్సాహంగా ఆడిపాడి సందడి చేశారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల విద్యాలయంలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి మాట్లాడారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్లే వే విధానంతో విద్యార్థులు పాఠశాలలకు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఉత్తీర్ణత పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

రాయపర్తి : తనను బెదిరించారని మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కొండూరుకు చెందిన ఇబ్రహీం, మహబూబ్‌నగర్‌కు చెందిన బొమ్మిదేని కోటేశ్వర్ బెదిరింపులకు పాల్పడుతూ ఉపాధ్యాయుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కొలన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిని సోమవారం వారు బెదిరించారు. దీంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇద్దరిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై వద్దె సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులను దండిస్తే చర్యలు తప్పవు



విచారణ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల

ఖానాపురం : విద్యార్థులను చితకబాదినా, దండించినా చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేట గ్రామంలోని బ్రిలియంట్ స్కూల్‌లో ఇద్దరు విద్యార్థినులను ఉపాధ్యాయురాలు ఇటీవల చితకబాదితన క్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈఓకు స్కూల్ ప్రిన్సిపాల్ వివరణ ఇచ్చారు. విద్యార్థినులను చితకబాదిన ఉపాధ్యాయురాలిని విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు. మరోసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

తల్లిదండ్రులకు విద్యార్థి అప్పగింత

చెన్నారావుపేట : స్కూల్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన విద్యార్థి ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మూడు గుడిసెల తండా శివారులోని కోబల్ తండాకు చెందిన బోడ గణేశ్ మండలంలోని సిద్దార్థ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. ఈనెల న స్కూల్‌కు వచ్చి సాయంత్రం గణేశ్ అదృశ్యం కాగా అతడి తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు విద్యార్థి హైదరాబాద్‌లో గణేశ్ తల్లిదండ్రులు పని చేసే ప్రదేశానికి వెళ్లినట్టు గుర్తించారు. అనంతరం విద్యార్థిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు, తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో

● దంపతులకు తీవ్ర గాయాలు



తప్పిన పెను ప్రమాదం

చెన్నారావుపేట : ప్రమాదశాత్తు ఆటో ఈత చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని పాత మగ్దుంపురం శివారులోని లోలెవల్ కాజ్‌వే వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన ఆటో యజమాని తన భార్యతో కలిసి సంగెం మండలంలోని లోహిత గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో నర్సంపేటకు వెళ్తుండగా పాత మగ్దుంపురం శివారులోని లోలెవల్ వంతెన వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోగా అదుపు తప్పింది. వంతెన నుంచి పక్కకు దూసుకెళ్లి ఆటో ఈత చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యభర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు ఇద్దరినీ నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆటో కొంచెం ముందుకు వెళ్లి పడితే ప్రాణాలు గాల్లో కలిసేవి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు, వాహనదారులు మండిపడుతున్నారు. లోలెవల్ వంతెనకు రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలోనూ ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు. గాయపడి ఇంకా చికిత్స పొందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి లోలెవల్ వంతనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

దామెర : మండలంలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నీటి సరఫరాపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి కోసం తీసుకుంటున్న చర్యలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ కుమార్ వివరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లాల ద్వారా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఉపాధిహామీ పనుల వివరాలు, గ్రామాల వారీగా టార్గెట్ చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ రాంగాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పిల్లలమర్రి సతీష్‌కుమార్, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతుల్లో ఆనందం



పసుపు తీస్తున్న మహిళా రైతులు

దుగ్గొండి : పసుపు రైతుల్లో ఆనందం కనపడుతోంది. ఐదారేళ్లుగా గిట్టుబాటు ధర కూడా లభించని, దిగుబడి సరిగా రాని పరిస్థితుల్లో అన్నదాతలకు పసుపు సాగుపై ఆసక్తి తగ్గింది. అయినా మండలంలో కొందరు ఏటా పసుపు సాగు చేస్తున్నారు. ఈసారి తక్కువ విస్తీర్ణంలో పసుపు సాగు నమోదైంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పసుపు పంటకు చీడపీడలు ఆశించలేదు. మెరుగైన దిగుబడులు వచ్చే పరిస్థితి కనపడుతోంది. మార్కెట్‌లో పసుపు పంటకు క్వింటా రూ.12–15 వేల ధర పలుకుతుండటం, పచ్చి విత్తన పసుపు క్వింటాకు రూ.5 వేలు పలుకుతండటంతో పసుపు రైతుల కళ్లల్లో ఆనందం కనపడుతోంది. మండలవ్యాప్తంగా పసుపు దున్నకం మొదలైంది. రైతులు, కూలీలు పసుపు తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఎండలు దంచి కొడుతున్నా లెక్కచేయకుండా మహిళా రైతులు పసుపు తీసే పనులను ముమ్మరం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ



చింతనెక్కొండలో..

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని పర్వతగిరిలో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల కోసం మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

చింతనెక్కొండలో..

చింతనెక్కొండలో చైతన్య గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైతన్య, విఘ్నేశ్వర, భవానీ గ్రామైక్య సంఘాల అధ్యక్షులు సుస్మిత, లలిత, అనిత ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సీసీ వర్కాల సుధాకర్ పాల్గొన్నారు.

'సినోవం 2కే 24' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్ (బిట్స్) కళాశాలలో ఈనెల 20న నిర్వహించనున్న సినోవం 2కే24 (స్టేట్ లేవల్ ఎంబీఏ స్టూడెంట్స్ మీట్) కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీట్‌లో విద్యార్థుల ప్రతిభను పరీక్షించేలా వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ మాట్లాడుతూ మీట్లో నిర్వహించనున్న బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్ అవార్డ్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, ఫైనాన్స్ ఈవెంట్స్, సాంస్కృతిక కార్యక్రమాల గురించి వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బాలాజీ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, బిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాం సుందర్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, సీఏఓ సురేశ్, మేనేజ్‌మెంట్ కళాశాల విభాగాధిపతి నరేశ్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ గోపీ కృష్ణ, కోఆర్డినేటర్ భరత్, అధ్యాపకుడు కార్తీక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వరంగల్ ఎంపీగా కావ్య గెలుపు ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న సహదేవ్

వర్ధన్నపేట : వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ స్పష్టం చేశారు. అధికార ప్రతినిధిగా నియమితుడైన సందర్భంగా ఆయన్ను మండల కేంద్రంలో నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో కొనసాగినా సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, బీఆర్‌ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. తుక్కుగూడలో ఈనెల 7న (శనివారం) నిర్వహించే జనజాతర సభకు నియోజకవర్గం నుంచి శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తన నియామకానికి సహకరించారంటూ ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు సమ్మెట సుధీర్, మహ్మద్ అఫ్సర్, చిదురాల కుమారస్వామి, సమ్మెట రాంబాబు, కొండేటి బాలకృష్ణ, మల్లెపాక సమ్మయ్య, శివరాత్రి ఎల్లస్వామి, చెరుపెల్లి బాబు, షబ్బీర్, చంద్రమౌళి, బాబు, భాస్కర్, స్వామి, వెంకన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్' మత సామరస్యానికి ప్రతీక



నల్లబెల్లి : రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును మత సామరస్యానికి ప్రతీకగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేడిపల్లి రాజు గౌడ్ అభివర్ణించారు. మండల కేంద్రంలోని మసీదులో ఆయన ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విందులో మత గురువు రషీద్ అన్వర్ ఇఫ్తార్ విందు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రాజు గౌడ్ మాట్లాడారు. రంజాన్ మాసంలో శాంతికి, సామరస్యానికి నిదర్శనంగా ముస్లిమ్ సోదరులు ఉపవాస దీక్ష చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు షబ్బీర్, అఫ్జల్, అక్బర్, సద్దాం, వాజిద్, మహ్మద్, నాయకులు బత్తిని మల్లయ్య, కొండి అశోక్, మేడిపల్లి లక్ష్మణ్, గద్దె జయపాల్‌రెడ్డి, కనుకం ప్రణీత్, కోడూరి సిద్దు, తదితరులు పాల్గొన్నారు.